క్లుప్తంగా

నేడు కాంగ్రెస్ పార్టీ సమావేశం

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం శుక్రవారం మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు తుర్కయంజాల్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ హరితా ధన్‌రాజ్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉ. 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బోరుమోటార్ల కేబుల్ వైర్లు చోరీ

యాచారం: మండలంలోని ధర్మన్నగూడ, చౌదర్‌పల్లి గ్రామాల్లో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు వ్యవసాయ బావుల వద్ద సర్వీస్ కేబుల్ వైర్లను చోరీ చేశారు. రెండు గ్రామాలకు సంబంధించిన 24 మంది రైతులకు చెందిన 32 కనెక్షన్ల కేబుల్ వైర్లను కత్తిరించి తీసుకెళ్లారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు గురువారం ఉదయం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి మోటార్లు ఆన్ చేయగా సర్వీస్ వైర్లు కత్తిరించి ఉన్నాయి. ఈ విషయమై ఆయా గ్రామాలకు చెందిన రైతులు యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.లక్ష పట్టివేత

మంచాల: ఎన్నికల నేపథ్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.లక్ష పట్టుబడిన ఘటన మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మంచాల సీఐ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. లోయపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. నల్గొండ జిల్లా చండూర్ మండల కేంద్రానికి చెందిన ముమ్మడి శ్రీనివాస్, కిరాణ వ్యాపారి, అతని నుంచి లక్ష రూపాయాలు పట్టుకున్నట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసిన్నట్లు సీఐ తెలిపారు.

మద్యం అమ్మకాల్లో రాష్ట్రం అభివృద్ధి

టీఎస్‌పీఐ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరెడ్డి



యాచారంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

యాచారం: కేసీఆర్ సర్కార్ మద్యం అమ్మకాల్లోనే అభివృద్ధి చెందిందని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి కొంతం మాధవరెడ్డి దుయ్యబట్టారు. సాధ్యం కాని హామీలతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు పోటీ పడుతున్నాయని విమర్శించారు. గురువారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారని ఆరోపించారు. నేడు ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితిలో తెలంగాణ ఉందని తెలిపారు. మరో సారి బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తుందని చెప్పారు. అధికారం కోసం సాధ్యం కాని హామీలిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. తనను ఎమ్మె ల్యేగా గెలిపిస్తే సేవకుడిగా పని చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, వెంకట్‌రెడ్డి, బాల్‌రాజ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆందోళన

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్‌ఆర్ ఇంటిపై ఐటీ అధికారులు దాడులకు నిరసనగా ఆ పార్టీ నాయకులు ఆందోళన చేశారు. విషయం తెలియడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి గురువారం ఉదయమే చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు కలిసి ఆడుతున్న నాటకమమని మండిపడ్డారు. ఎన్ని దాడులు చేసిన తాము భయపడేది లేదని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

పహాడీషరీఫ్: రాష్ట్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానికులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానంటున్న మంత్రి సబితా రెడ్డికి జల్‌పల్లి మున్సిపాలిటీ సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఏళ్లు గడుస్తున్నా ఉస్మాన్‌నగర్ ముంపు సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఆరు గ్యారంటీ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ న్యాయం చేస్తుందన్నారు. చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, యెల్మేటి అమరేందర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, అహ్మద్ బాబ్, యూసుఫ్ ఖాద్రీ, వసీం షా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో విభేదాల్లేవ్



ఇబ్రహీంపట్నం రూరల్: మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి, కోదండరెడ్డి



యాచారం: కాంగ్రెస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నేతలు

- మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- అందరం కలిసి పార్టీని గెలిపించుకుంటాం: కోదండరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని నాయకులంతా పార్టీ గెలుపు కోసం కష్టపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, పాశం లక్ష్మీపతిగౌడ్, ఈసీ శేఖర్‌గౌడ్, జెడ్పీటీసీ మహిపాల్, కొత్తకుర్మ శివకుమార్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిజాం నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో గడిచిన 15 సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల నుంచి భూములు లాక్కొని హెచ్‌ఎండీఏ అధికారులతో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని ఆరోపించారు. ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు, రేషన్ కార్డులు ఇవ్వని ప్రభుత్వం బీఆర్‌ఎస్ సర్కార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శివన్నగూడ ప్రాజెక్టు ద్వారా సాగునీరు తెస్తామని నేటికి కనీసం పనులు కూడా చేపట్టక పోవడం సిగ్గు చేటన్నారు. గ్రామీణ పేదల సంక్షేమానికి ఏనాడు ఒక్క కొత్త పని చేయలేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అవినీతి బయటపెడతామని హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నేడు బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ హాల్‌లో జరగబోయే విస్తృత స్థాయి సమావేశానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మాణిక్‌రావు థాక్రే హాజరవుతున్నారని, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు చిలుక మధుసూదన్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, దాసు, కరుణాకర్‌రెడ్డి, విజయ్‌లతో ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఫార్మాసిటీని రద్దు చేయిస్తా..

యాచారం: ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ఫార్మాసిటీని రద్దు చేయిస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. నక్కర్తమేడిపల్లి నుంచి 150 మందికి పైగా బీఆర్‌ఎస్, బీజేపీ శ్రేణులు గురువారం నగరంలో మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రాణకోటికి ప్రమాదకరమైన ఫార్మాసిటీ రైతులు వద్దని వ్యతిరేకిస్తున్న కేసీఆర్ సర్కార్ బలవంతంగా ఏర్పాటు చేస్తోందని మండిపడ్డారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఫార్మాసిటీని రద్దు చేయించి రైతులకు న్యాయం చేస్తానని అన్నారు. కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని అన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీజేపీ నాయకులు అచ్చిరెడ్డి, కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నాయకులు గణేష్, మా జీ సర్పంచ్ బాల్‌రాజ్‌గౌడ్ ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, శ్రీశైలం, సంగెం మల్లేష్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు

ఎంపీడీఓ విజయలక్ష్మి



యాచారం: మాల్‌లోని పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించిన ఎంపీడీఓ విజయలక్ష్మి

యాచారం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ స్టేషన్‌ల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండలంలోని యాచారం, మాల్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ స్టేషన్లను సందర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులతో వెళ్లి పోలింగ్ స్టేషన్‌ల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మంచాల: ఎన్నికల నేపథ్యంలో ఎంపీడీఓ శ్రీనివాస్ గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాపాల, ఆరుట్ల, అస్మత్‌పూర్, మంచాల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను గుర్తించి అన్ని రకాలు వసతులు కల్పించడం జరుగుతుందని వివరించారు. మండలంలో 45 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. అవసరమైన చోటు సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆయా పోలింగ్ కేంద్రాల పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.



మంచాల: అస్మత్‌పూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు

ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వండి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఆచారి

కల్వకుర్తి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఆచారి

కడ్తాల్: గత 40 సంవత్సరాలుగా బీజేపీలో ఉంటూ, కల్వకుర్తి నియోజకవర్గ ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు, ఉద్యమాలు చేశానని, తనకు ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని, కల్వకుర్తి నియోజవకర్గ బీజేపీ అభ్యర్థి ఆచారి అన్నారు. గురువారం మండలంలోని ఎక్వాయిపల్లి, మద్రిపల్లి, ముద్విన్, చరికొండ, పల్లెచెలక, రావిచేడ్, కోర్షకొండ తదితర గ్రామాల్లో, పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాలుగా రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా, అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని, మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టి పాలన సాగిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి శంకర్‌నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యానాయక్, నాయకులు డాక్టర్ రమేశ్, మోహన్‌రెడ్డి, వీరయ్య, రాందాస్‌నాయక్, రెడ్యానాయక్, సాయిలాల్‌నాయక్, మహేశ్, బల్వంత్‌రెడ్డి, లింగంగౌడ్, సాయిలు, సాయి, భగీరథ్,రవి తదితరులు ఉన్నారు.

'గ్యారంటీ'ల్లో ముస్లింల ప్రస్తావనేది?

బీఆర్‌ఎస్ నాయకుడు కార్తీక్ రెడ్డి

పహాడీషరీఫ్: కాంగ్రెస్ పార్టీ ముస్లింలను ఓటు బ్యాంక్ రాజకీయాలకు వాడుకుంటోందని బీఆర్‌ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రియాజ్ ఖాన్ అనుచరులతో కలిసి బుధవారం రాత్రి జల్‌పల్లి మున్సిపాలిటీలోని షాహీన్‌నగర్‌లో కార్తీక్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలలో ముస్లింల ప్రస్తావనే లేదన్నారు. ముస్లింల సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందని ప్రకటించారు. ఈ ప్రాంతంపై కనీస అవగాహన లేని నాయకుడిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, సూరెడ్డి కృష్ణారెడ్డి, ఎక్బాల్ ఖలీఫా, షేక్ అఫ్జల్, యంజాల అర్జున్ పాల్గొన్నారు.

అధికారం రాగానే 'గ్యారంటీ'లు అమలు

మల్‌రెడ్డి రంగారెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజల జీవితాలలో వెలుగులు నిండుతాయని కల్వకుర్తి ఆ పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. గురువారం ఆమనగల్లు, కల్వకుర్తి మండలాలలోని పలు గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పాటైన ప్రజల కష్టాలు తీరడం లేదని అన్నారు. తెలంగాణ ప్రజల సమస్యలు నెరవేరాలంటే కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావాలన్నారు. కాంగ్రెస్‌పాలనలోనే సబ్బండ వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రచార కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: ప్రచారం నిర్వహిస్తున్న కసిరెడ్డి మాధవిరెడ్డి, తదితరులు

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా, కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, కడ్తాల్ పట్టణానికి సంబంధించి 154వ బూత్ కమిటీని, ఎన్నుకుని నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థి కసిరెడ్డికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, పార్టీ ప్రకటించిన గ్యారంటీ పథకాలను గడపగడపకూ వివరించాలని కోరారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, రమేశ్, మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యంయాదవ్, మల్లయ్య, జంగయ్య, సాయిలు తదితరులు ఉన్నారు.

రూ. 500కే గ్యాస్ సిలిండర్

తలకొండపల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీ పథకాలను కచ్చితంగా అమలు చేస్తామని కసిరెడ్డి మాధవిరెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సతీమణి మాధవిరెడ్డి గురువారం మండలంలోని ఖానాపూర్‌లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను నేరుగా ఆమె కలుసుకొని, నారాయణరెడ్డిని మెజార్టీతో గెలుపించాలని కోరారు. ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, చెయ్యి గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. 500కే సిలిండర్ ఇస్తామన్నారు. కాంగ్రెస్‌తో అన్ని వర్గాలకు సమప్రాధాన్యం ఉంటుందన్నారు. నారాయణరెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్: సమావేశంలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

కాంగ్రెస్‌తోనే జీవితాల్లో వెలుగులు

తుర్కయంజాల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని పీసీసీ ఉపాధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం కమ్మగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 18, 19, 22, 23 వార్డుల ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, వైస్ చైర్ పర్సన్ హరిత, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రంగారెడ్డి, కౌన్సిలర్లు మంగమ్మ, ఐలయ్య, కాకుమాను సునీల్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



కడ్తాల్: నూతన కమిటీ సభ్యులతో శ్రీనివాస్‌రెడ్డి



ఆమనగల్లు: మాట్లాడుతున్న కసిరెడ్డి

జైపాల్‌యాదవ్‌ను గెలిపించుకుందాం



మాడ్గుల: ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



కడ్తాల్: ప్రచారం నిర్వహిస్తున్న దశరథ్‌నాయక్, నాయకులు

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

ఆమనగల్లు: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు పానుగోటి అర్జున్‌రావ్ అన్నారు. మండలంలోని ఆకుతోటపల్లిలో గురువారం బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి జైపాల్‌యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంగమ్మ, మండల రైతు సమన్వయ సమితీ కన్వీనర్ నారాయణ, ఎంపీటీసీ కుమార్, స్థానిక నాయకులు వెంకటయ్య, రంగయ్య, విజయ్, సాయిలు, శివ, కృష్ణ, వెంకటరమణ, యాదయ్య, శంకర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మాడ్గుల: ప్రస్తుతం జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మాడ్గుల మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గిరికొత్తపల్లి, నల్లావారిపల్లి, అవురుపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ రాజవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ పద్మ శీను, ఎంపీటీసీ సరిత, బ్రహ్మంగౌడ్, హరికృష్ణ, దినేష్, శివ, శంకర్ పాల్గొన్నారు.



ఆమనగల్లు: ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించండి

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌ను మరోసారి గెలిపించాలని, గురువారం మండలంలోని గానుగుమార్లతండాలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో నాయకులు ,కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడపగడపకూ తిరుగుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోలోని అంశాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు లక్పతినాయక్, సేవ్యా, లాయక్‌అలీ, పాండు, శ్రీను, భీమన్, మహేశ్, చందర్ తదితరులు ఉన్నారు.



మంచాల: కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నేతలు

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

మంచాల: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు గురువారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చింతకింది చక్రపాణి, ఆ పార్టీ రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి మంకు ఇందిర, తిప్పాయి గూడ సర్పంచ్ , బీజేపీ నాయకుడు శివరాల పాండుతో పాటు ఆయా గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చీరాల రమేశ్, మండల యువజన విభాగం అధ్యక్షుడు వనపర్తి బద్రినాథ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సబితారెడ్డిని విమర్శిస్తే సహించం

బీఆర్‌ఎస్ నాయకులు

కందుకూరు: కాంగ్రెస్ నాయకుల ఇళ్లపై జరిగిన ఐటీ దాడులతో ఎలాంటి సంబంధం లేని మంత్రి సబితారెడ్డిని దూషించడం సరికాదన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఐటీ, ఈడీ సంస్థలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తాయని, ఈ విషయం తెలియని కాంగ్రెస్ నాయకులు ఆరోపించడం సిగ్గు చేటన్నారు. తమ కార్పొరేటర్ ఇంటిపై కూడా ఐటీ అధికారులు దాడులు చేశారని తెలిపారు. జాతీయ పార్టీల మధ్య ఉన్న గొడవలు బీఆర్‌ఎస్‌కు పూయడం విడ్డూరంగా ఉందన్నారు. ఏదైనా ఉంటే ఆ పార్టీలు చూసుకోవాలని, అనవసరంగా సబితారెడ్డిని విమర్శిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో సర్పంచ్ సాయిలు, ఉప సర్పంచ్ కొండల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మహేందర్‌రెడ్డి, దర్శన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సబితారెడ్డికి సంబంధం లేదు

బడంగ్‌పేట్: మేయర్ పారిజాత ఇంటిపై ఐటీ దాడులకు మంత్రి సబితారెడ్డికి ఎలాంటి సంబంధం లేదని బీఆర్‌ఎస్ నాయకులు కొట్టిపారేశారు. మంత్రిని బదునాం చేయడం మేయర్‌కు తగదని హెచ్చరించారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో సబితారెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఆనంద్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు, ఎస్సీసెల్ అధ్యక్షుడు సంతోశ్, ఉపాధ్యక్షుడు బాలేష్‌చారి ఉన్నారు.